

# యాళ్‌పాణం గోస

మన్నం సింధుమాధురి

అది జాఫ్నా ప్రాంతం.

మూడోతరగతి రైలుపెట్టెల్లా గజిబిజిగా ఉండయ్యి ఇళ్లు. మనుషుల ఒళ్లు కాకిరంగుకి కవిలి చెమటలు కారతా సూర్యుడి ఎలుగు పడ్డప్పుడు బొచ్చచేప పొలుసులా ఉప్పిరిసి మెరుత్తున్నయి.

అందరూ పిల్లలూ, ముసలాళ్లే... ఎక్కువగా ఆడాళ్లే. మగాళ్లు లేని జానపదకథలోని రాజ్యంలా వుంది ఆ ఊరు. నడుం దగ్గర లోపలనించి లాగి ఎన్నుకు ఆనుకుంటున్న కుచ్చిళ్లతో ఎడపైటలు ఎగ్గట్టిన ముతక నూలు చీరలతో ఉన్నారందరూ. తోళ్లు కప్పుకున్న కట్టెల్లా మెల్లిగా కదులుతున్నారు ఆ ఇళ్ల మధ్యలో వాళ్లు. చెవుల్ని ఆకాశం వంకా, చూపుల్ని గుంటలు పడ్డ రోడ్ల దిక్కూ ఎక్కుపెట్టి, కళ్లు ఇప్పారిసిన రాత్తిరి గూబల్లాగా గుసగుసలాడుకుంటున్నారు.

ఉడుకుతున్న అన్నం, చేపల కూర చూత్తా, 'పొట్టలో కెలతయ్యో, నట్టి పగులుద్దో ఎవురికి తెలుసుద్ది,' అని గొణుక్కుంటోంది పొయ్యి ముందు కూసున్న ఆడది. కూడొండుతున్నామె దగ్గరికి పరుగున వచ్చి, గసపోసుకుంటా అంది అరవై ఏళ్ల ముసల్ది. "నా కూతురు కన్నది. పుట్టిన గుడ్డు సచ్చింది. పొద్దున్నించీ మాయ పడక కడుపులో పోటుతో ఏడుత్తోంది. ఆస్పత్రికి తీసకెలదాం అంటే రోడ్డంతా మడిసిలోతు గుంటలు. మంత్రసానమ్మ కోసం ఎలితే, దాని ఇంటి దగ్గర దిక్కుమాలిన, గబ్బు పట్టిన సైనికులు. ఏం జెయ్యను," అని నీరెండిపోయిన కళ్లని ముడతలు పడి ఒంటికి చుట్టుకున్న నూలుగుడ్డతో అలవాటుగా తుడుసుకుంది.

పొయ్యి ముందు కూచున్నామె, "మనుషులం బతకటానికి, తింటానికే లేదు. ఇక మన సెరకి కడుపులో బిడ్డలు కూడా... వత్తన్నా పా," అని ఇంటి సూరులో దోపిన ఎంటికల సవరంలాంటిది బయటికి లాగి, దాన్ని రెండు రొమ్ముల మీదుగా కప్పుకున్న పైటగుడ్డల్లో దాపెట్టుకుని, కాళ్లు ఒరుసుకుంటా నడిసి బయలుదేరింది.

కారిన ఉమ్మనీళ్లు, పేణం లేకుండా బయటపడ్డ పిండం, నెత్తురు... అదోలాటి నీసుగబ్బు కొడతంది ఆ ఇల్లు. పట్టికెళ్లిన ఎంటికెల దండ పురుడయిన ఆడదాని నోట్లో కుక్కింది. అంతే 'వ్యాక్'మని కక్కింది. బళుక్కున నోట్లో నించి ఎంటికల దండా, రెండు కాళ్ల మధ్యలో నుంచి మాయా ఒకేసారి బయటపడ్డాయి.

ప్రసవమయ్యి, మాయపడి, నెప్పి తగ్గిన ఆ చల్లని చూపుని కూడా పట్టిచ్చుకోకుండా పరుగున బయటికి నడిసింది ఆమె.

ఇంటికి జేరుకునేప్పటికే ఒక పిల్లాడు జారిపోతన్న లాగుని పైకి లాక్కుంటూ ఎదురొచ్చాడు. మెడలో తాయెత్తు. అది చూడ్డానికి మామూలుగానే కనిపిచ్చుద్ది. జాగ్రత్తగా చూసేవాళ్లకి మాత్రం అర్థమవ్వుద్ది అదేంటో.

"తంబికి అన్నం డబ్బా," అన్నాడు.

ఆదరాబాదరా ఉడుకుతున్న ముతక ఉప్పుడు బియ్యాన్ని అన్నండబ్బాలో కుక్కి, ఒక గిన్నెలో కూర ఏసి డబ్బీ కదలకుండా మూడు నాలుగుసార్లు నొక్కి గట్టిగా మూతపెట్టి ఇచ్చింది. కళ్లతోటే జాగ్రత్త చెప్పి, ఆ పిల్లాడిని దగ్గరికి లాక్కుని, "బాటమీదికి ఎల్లొద్దు. డొంకదారుల్లోనే

ఎల్లి... తొందరగా తిరిగి రా. అన్నం తినాల. రాత్తిరయితే సవురు బుడ్డులు కూడా ఉంచటల్లేదు,'' అంది.

చొక్కాలేని బక్క మెడలో మురికి తాయెత్తు ఊగు తుంటే పరిగెత్తినట్టు నడుత్తున్నాడు వాడు. ఊరు దాటక ముందే టప్‌మని చప్పుడైంది. గుండు వాడికి తగిలిందా, అన్నండబ్బాకి తగిలిందా అనుకునే లోపల క్షణాల్లో నేల కూలిపోయాడు వాడు. టకటక బూట్ల చప్పుడు ఊరు దాటాక చిన్నాచితకా, ముసలీ ముతకా మూగారు. రెండు నిమిషాల్లో అక్కడ పగిలిన అన్నండబ్బా కానీ, చిందిన లేత కూటి నెత్తురు జాడకానీ లేదు. రాతి మంద్రగబ్బల గుంపు నడకలా సైన్యం కదిలిపోయింది ముందుకి.

*

విజయేంద్ర ఆఫీసుకి తయారవుతున్నాడు. చాలా ఉత్సాహంగా వున్నాడు. ఆరోజు కేథరిన్‌ని కలుసుకోబో తున్నాడు. ఆఫీసు నుంచి అటే ఆమె ఇంటికి చేరుకుం టాడు. మరుసటిరోజు సెలవు. సెలవు రోజంతా కేథరీన్ తోనే. ఉల్లాసంగా రెడీ అవుతున్నాడతను.

"అన్నా!"

"ఏమ్మా."

"ఈరోజన్నా రైలుస్టేషనుకి తీసుకెళ్లు. మీ బావ గారొస్తారేమో. ఎందుకో ఈరోజు తప్పకుండా వస్తారని అనిపిస్తోంది."

"అట్లాగే సాయంత్రం ఐదున్నరకి నువ్వూ, పాపా తయారుగా ఉండండి. తీసుకెళతాను,'' అతని కంటి నీటిపొర జిగురుగా గొంతులో అడ్డం పడ్డట్టయ్యింది.

ఆ సాయంత్రం, వాకిట్లో కారు పార్క్ చేసి, "కేథీ...'' అంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు విజయేంద్ర. ప్రేమ తొణికిసలాడే కళ్లతో ఆమె అతడ్ని ఆహ్వానించింది.

"డిన్నర్‌కి బయటకు వద్దు. ఇంట్లోనే చేసు కుందాం,'' సోఫాలో వాలుతూ అన్నాడతను.

"ఏం వండను?''

"మేక మాంసం, మొరాకో పద్ధతిలో.''

"సరే,'' అని టమాటా, అల్లం, ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయల్ని అతని ముందు పెట్టింది, కొయ్యమని. మేక మాంసాన్ని ఫ్రిజ్‌లోనించి బయటికి తీసింది. మసాలా నూరి, ఆలివ్ ఆయిల్‌తో కలిపి మాంసంలో నానబెట్టింది. మేక కాలిముక్కలు పళ్లెంలో పెట్టి, నూరిన మసాల ముద్ద దాని మీద వేసింది. మొరాకో క్లే వెసల్ (గరాటులాగా రెండు భాగాలుగా ఉండే మట్టి వంట పాత్ర)ను ముక్కల మీద బోర్లించింది. పళ్లాన్ని బొగ్గుల కుంపటి మీద ఉంచి గరాటు మూతి బెజ్జంలో నించి ఉప్పు పోసి, బొగ్గులని కమ్చీతో కదిల్చి వచ్చింది, విజయేంద్ర దగ్గరికి. అతడి కళ్లలో అలసట. చూపులు ఎక్కడో వున్నాయి. పక్కన కూర్చోబోతూ, లేచి గాజు గ్లాసుల అర దగ్గరకెళ్లింది. గ్లాసులో విస్కీ పోసి విజయ్ చేతికి అందిచ్చి ఎదురుగా వచ్చి కూర్చుంది.

"ఇప్పుడు చెప్పు, ఆఫీసులో ఏమైనా గొడవలా?''

"ఊహూ. ఇంట్లో చెల్లెల్ని చూస్తుంటే, కడుపు రగిలిపోతా ఉంది. ఆమెనీ, ఆమె బిడ్డనీ, అలా చూడ్డం కష్టంగా వుంది. ఆమె లోపల గడ్డ కట్టిన బాధని ఎట్లా కరిగించాలో తెలీటంలేదు. వట్టి బొమ్మల్లా తిరుగు తున్నారు. నా ఇద్దరు బిడ్డల బాధ ఇది,'' విజయేంద్ర గొంతులో వినీ వినపడని వైరాగ్యపు నవ్వు.

"ఎప్పుడడిగినా ఏమిటో చెప్పనే చెప్పవు. ఎంత కాలం దాచుకుంటావ్ కడుపులో... ఈరోజన్నా నాతో పంచుకో.''

"సరే కేథీ... ఈరోజు నా గుండె విప్పి నీ ముందు పరవాలనుంది,'' అంటూ బాత్‌రూమ్‌కేసి కదిలాడు, ఖాళీ అయిన విస్కీ గ్లాసు టీపాయ్ మీద పెట్టి.

*

మొండి గోడ కింద నిలబడ్డారు నలుగురు ఆడాళ్లు. చుట్టూ ఎటుచూసినా కూలిన కొంపలే. పచ్చని అడవుల్లో కళకళలాడిన ఇండ్లే ఒకప్పుడు అవన్నీ. రంగు రంగుల లంగాల మీద పూలపూల చొక్కాలు వేసుకుని సీతాకోకచిలుకల్లా అటూ ఇటూ తిరిగే అమ్మాయిలతో, జీరంగుల్లా ఎగురుతూ ఆటలాడే మగపిల్లలతో, వంట పనుల్లో మునిగి తేలే ఆడాళ్లతో, పనుల్లేనపుడు చెట్ల కింద గుంపుగట్టి కబుర్లు చెప్పుకునే మగాళ్లతో... ఆ ఊరు ఎంతో సందడిగా ఉండేది ఒకప్పుడు. ఆ ఊరే కాదు, ఆ ప్రాంతంలో అన్ని ఊళ్లు ఇప్పుడు, బతికిన శవాలుండే స్మశానాలను తలపిస్తాయి. పండిన పొలం మీద దాడి చేసే మిడతల దండులా హఠాత్తుగా వచ్చి వాలుతారు సైనికులు ఆ ఊళ్ల మీద, 'తంబి ఎంగే,' అంటూ. ఇళ్లలో మిగిలిన ముసలాళ్లను బూతుమాటలతో పలకరిస్తూ, ఆడాళ్ల రొమ్ముల మీద చేతులేసి నొక్కి చవక జోకులతో పగలబడి నవ్వుతూ, కాళ్లతో పిల్లల్ని అదిలిస్తూ కుండా, సట్టిని పగలగొట్టుకుంటూ, ఊరంతా అల్లకల్లోలం చేసి ఎల్లిపోతారు ఆళ్లు. అట్లాంటి వాటికి ఆ ఊళ్లు ఎంతగా అలవాటుపడిపోయాయంటే, సైనికులు ఊరు దాటి వెళ్లిపోయిన తర్వాత కూడా ఎవరూ జరిగిన దాని గురించి ఒక్క మాటా మాట్లాడుకోరు. మాటలు రాని మరబొమ్మల్లా పనులు చేసుకుంటూ ఉంటారు.

అట్లాంటి చోట ఆ నలుగురు ఆడాళ్లకీ బతికే చావొచ్చి పడింది. చావువాసన కమ్మిన ఆ ఊళ్లోనూ ఒక అమ్మాయీ ఒక అబ్బాయీ ప్రేమించుకున్నారు. అంత వరకే అయితే సరే, పెళ్లి చేసుకోవాలనుకోవడమే విడ్డూరం. అందులోనూ పెళ్లిచేసే పెద్దరికాన్ని ఈ నలుగురు ఆడవాళ్ల మీదా పెట్టారు. ఈ దిక్కు తొయ్యని దినాలలో పెళ్లెట్లా సెయ్యటం? ఒకపూట తినీ, ఒకపూట తినకా బతుకుతున్న జనం. అయినా, నోరు తెరిచి అడి గారని, పెళ్లి చెయ్యాలనే అనుకున్నారు ఆ నలుగురు ఆడవాళ్లు. కష్టం మీద రెండు జతల కొత్త గుడ్డలు కూడే శారు. నలుగురు ముసలమ్మల నడిగి ఎట్టాగో పిసరంత బంగారం సంపాదిచ్చారు. దాంతో యాళ్‌పాణం కొడి (ఆకు ఆకారంలో ఉండే తాళి) చేయించారు. ఆ నలుగురి పేర్లు అంబిక, రత్న, రమేశ్వరి, సుందరి. ఆ రాత్రికే ముహూర్తం.

*

సైనికుల కాల్పులలో సచ్చిపోయిన చొక్కాలేని పిల్లాడిని కూలిపోయిన బడి ఎనక బాంబులకి పడ్డ గొయ్యి దగ్గరికి మోసుకెళ్లారు గబగబా. వాడిని పూడిసే ముందు యూనిఫాంలో ఉండే ఒక తంబి వచ్చి జాగ్రత్త గా మెడలోని తాయెత్తు ఇప్పి తీసుకున్నాడు. వాడి తల్లికి భోరున గుండెనిండా యాడవాలని ఉంది. ఏడుపుని కూడా అదిమేశారు. శోకం బయటికి పొంగక నీరుడుగా మారి కూచ్చున్న దగ్గిరే సీరలోనించి మట్టిలోకి ఇంకి నయ్యి. "ఏడిత్తే అందర్నీ తంబిలనుకుంటారు. ఇంటికి జత లెక్కన సచ్చారు ఇప్పటికే. సంఘమిత్ర బుద్ధ జపం ఇనిపించిన దేశంలో ఏ కొంపలోనూ ఆవాలు లేవు నీకు పెట్టటానికి... ఎవ్వరి బిడ్డలు బతికిరారు," అంటా బర బరా లాక్కుపోయింది ఒక ముసల్ది ఆ తల్లిని.

ఎండిపోయిన గుండెమీద శబ్దం రాకుండా కొట్టు కుంటా, "మగాళ్లు లేని ఊళ్లు వల్లకాడులు. రండిరా ముసలాళ్లం ముట్లెండిపొయ్యి ఉండాం. మేం కూడా పనికొత్తామా మీ ఆకలికి, కోరికకి. పూడ్చండి మమ్ముల్ని కూడా, నేలలోకి కుక్కండి. మీరు పాతేసిన ఎముకలన్నీ పెరియక్కై (పెద్ద చేతులై) తిరిగొచ్చి మీ గొంతులు పిసుకుతయ్యి. ఏం మిగిలి ఉండయ్యి... కూలిన కొంపలు, నాలుగు సత్తు సట్టిలు, గుడ్డలు పాతలు. ఈటి నేరా మీరు పట్టుకునేది," అని మొత్తుకుంటంది మరో ముసల్ది. ఇయ్యన్నీ మామూలే. పాణం ఉండేంతవరకూ ఇంకేదో చెయ్యాల్సిందే. తెల్లారేదాకా సైనికులకి దొర క్కుండా నిదరపోయేచోటు కోసం ఎతుకులాడుకుంటూ ఒక్కక్కళ్లూ అక్కడి నుంచి కదిలారు.

*

మూడో పెగ్గు తర్వాత విజయేంద్ర మౌనం బద్ద లైంది. "నాకు ఒక్కటే చెల్లెలు. అందంగా, చలాకీగా, సంతోషంగా ఉండేది. మా మేనత్త కొడుక్కి సైన్యంలో మంచి ఉద్యోగం. 'నీ కూతురిని, నా కొడుక్కిచ్చి పెళ్లి చెయ్యి,' అని అత్త వచ్చి నాన్నని అడిగింది. పన్నెండో తరగతి చదివే నా చెల్లెల్ని అతనికిచ్చి చేశారు. ఏమ్మటే ఒక పాప. అంతా ఆనందపడ్డాం. మాయదారి యుద్ధం దాపరిచ్చింది. అతను యుద్ధభూమికి ఎల్లక తప్పలేదు. అక్కడి పరిస్థితులు వివరించేవి అతను చెల్లికి రాసే ఉత్తరాలు. వారానికి ఒక జాబు వచ్చేది, అతని మమ కారాన్ని మోసుకుని. కూతురి ఆటపాటలు చూసుకోలేక పోతున్నానని బాధపడేవాడు," అంటూ ఖాళీగ్లాసుని ముందుకు జరిపాడు విజయేంద్ర.

"అతని ఉత్తరాలు కొన్ని చదవమని నాకు ఇచ్చేది మా చెల్లెలు. ఒకసారి ఒక ఉత్తరంలో రాసిన వాక్యం నన్ను ఎందుకో బాగా ఆకట్టుకుంది. మందలో నించి తప్పిపోయిన గొర్రెకి మందంటే చాలా ప్రేమ. కానీ మందకి ఆ గొర్రె మీద అంత ప్రేమ ఉండదు. ఇదీ ఆ వాక్యం. ఇప్పటికీ నాకు గుర్తుండిపోయింది. ఏంటి దీని అర్థం అని ఆలోచించేవాడిని. ఇంకోసారి ఉత్తరంలో ఒక సంఘటన గురించి రాశాడు అతను. వీళ్ల సైనికబృందం ఒకచోటు నుంచి ఇంకోచోటుకి వెళ్తున్నదట. అది పెద్దగా ప్రమాదం పొంచి ఉండేచోటు కాదు. సైనికులంతా ఉల్లాసంగా, కబుర్లాడుకుంటూ, జోకులేసుకుంటూ, నవ్వుకుంటూ ఎల్తున్నారంట. ఒక ఊళ్లో రోడ్డు దిగువన ఆడుకుంటున్న పిల్లలు కనబడితే, సైనికులు పలక రింపుగా వాళ్లకేసి చేతులూపారంట. తిరగి చేతులూపక పోగా ఒక పిల్ల, పదో పన్నెండో ఏళ్లుండే పిల్ల చొక్కా గుండీలు విప్పి, ఎద చూపిచ్చి, 'ఇదే కదరా మీకు కావా ల్సింది... రండిరా,' అని అరిచిందంట. అంతే భోరున ఏడుపు తన్నుకొచ్చిందంట అతనికి. రెండురోజులు ముద్ద దిగలేదంట. 'మన బిడ్డ పదేళ్లు ముందు పుట్టుంటే అంతయ్యి ఉండేది కదా,' అని రాశాడు." విజయేంద్ర గొంతు రుద్ధమైంది. కేథరీన్ అతడి చుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కుంది. వెంటనే పసిపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చాడతను కాసేపు.

*

బయలూ మరుగూ కాని ప్రదేశం అది. దట్టమైన చెట్లు. ఉప్పుగాలి. రాత్తిరి ఉక్కపోత. ఒక వ్యక్తికోసం ఎదురుచూస్తున్నారు అంబిక, రత్న, పరమేశ్వరి, సుందరి. తడినేలలో అడుగుల గుర్తులు పడతయ్. అట్లా

రావటం ముప్పేనని తెలుసు. కాని తప్పదు. పెళ్లికొడుకు 'తంబి'లకి చెందినవాడు. ఎప్పుడంటే అప్పుడు కలవటానికి లేదు. ఆమె యూనివర్సిటీలో చదువుకుంటుంది. యుద్ధం రోజుల్లో పెళ్లేంటి, ఆగొచ్చు కదా అంటే, అప్పటికే ఆమె గర్భవతి. యూనివర్సిటీలో వాళ్లందరూ యాళ్‌పాణం వాళ్లకి ఎతిరేకులేం కాదు. చాలామంది మామూలుగానే ఉంటారు. కొందరు మాత్రం డేగల్లాగా ప్రతి విద్యార్థినీ గమనిస్తా ఉంటారు. రేపు, పొట్ట ముందుకొస్తే రోత చేస్తారు. అసలే ఎంత బాగా చదివినా అరవై శాతం మార్కులు ఎయ్యాలంటే గొప్ప. యాళ్‌పాణం వాళ్లకీ, ప్రొఫెసర్లకీ ఎప్పుడూ గొడవలే. మరి తిరుగుబాటు పుట్టిందే అక్కడ కదా. నలుగురు విద్యార్థుల వలన. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వున్న శాఖలో పని చేసే అతనితో ఆమెకి ఆ గొడవల్లోనే పరిచయం కలిగింది. ఉద్యోగం అతనికి ఒక ముసుగు మాత్రమే. ఏదో ఒకరోజు అతనూ ఏరివేత జల్లెడలో జారే గింజే. ఇదంతా తెలుసు ఆమెకి. అందుకే ఆమె పెళ్లి అనే కోరిక కోరింది. ఎట్టాగయినా వాళ్ల కోరిక తీర్చి ఈ పెళ్లి చెయ్యాలని ఆ నలుగురి తాపత్రయం. ఆ నలుగురిలో పరమేశ్వరి సొంత కూతురే ఆమె. చీకటిలోంచి చీలి వచ్చిన చీకటిలాగా అతను వచ్చాడు. నిశ్శబ్దంగా చెట్ల మధ్యలోంచి కదిలారు ఆ నలుగురూ. ఆళ్ల వెనకే అతనూ.

గుసగుసగా మొదలైంది పెళ్లితంతు. బలవంతంగా జనాలని ఖాళీ చేయించిన దగ్గర కూలి, పాడుబడిన పదిళ్ల మధ్య స్థలమే పెళ్లివేదిక. అమ్మాయికి కొత్త చీర కట్టారు. అడివిపూల దండ మెడలో ఏసి, ప్యాంటుపైనే పంచెని లుంగీలా కట్టారు. ఒక పూల దండ మెడలో ఏశారు. పసుపు పూసిన నూలుదారానికి గుచ్చిన కొడి (తాళి) సిద్ధంగా ఉంది. ఇంతలో దడదడా మేళంలాంటి మోత. ఓ దృశ్యంపాటు మోహపు ఏమార్పు. లయబద్ధమయిన అశాంతి మోత. రెక్కలు విరిచే కవాతు. నేల అదురు.

భీతావహమైన స్వరంతో అతను ఇలా అన్నాడు. "అంటే, అంటే... మనలోనే... ఎవరో... పెళ్లి విషయం... చె...ప్పే...శా...రు... ప...ట్టి...చ్చే...శా...రు."

*

దట్టంగా చెట్టుకొమ్మలు, చిన్నచిన్న రాళ్లగుట్టలు, ఊరికి దూరంగా పొదల్లోనే కొద్దిమంది ఆడమగ ఆ రాత్తిరి నిద్దర్లుపోయారు. ఊరిమీద పడ్డ సైనికులకి దొరక్కుండా పిల్లా పీసూ కూడా లేని ఊరిని చూసి కచ్చ పట్టలేక, పోతా పోతా పశువులు తాగే నీళ్ల గుంటలో ఏదో మందు కలిపి ఎళ్లారు సైనికులు. మరుసటిరోజుకి గొడ్లన్నీ చచ్చి ఊరంతా ఇసిరేసినట్టుగా పడిఉండయ్యి. ఇక ఊరొదిలిపోక తప్పదు. ఇళ్లలో ఉండయ్యన్నీ మూటలు కట్టి, ముసలీ ముతకనూ, పిల్లా జెల్లల్నీ ముందుకి నడిపిచ్చారు అడవుల్లోంచి వచ్చిన తంబిలు. నాటిన వరిపొలాలు, బొదెల్లోంచి పొడుసుకొచ్చిన అరిటి గెలలు, ఎక్కడి కెలతన్నారో తెలియక బిక్కుబిక్కుమంటూ ఎంటబడి వస్తున్న ఊరకుక్కలు. ఎండిపోబోయే ముందు పారుతున్న నదిలా కదులుతున్నారు వాళ్లు. తుప్పల్లోకి దూరిపోయిన కోడిపుంజు కోసం ఎతుకుతున్న ముసల్దాన్ని అదిలిత్తున్నా రెవరో. 'పా...పా... మోసుకొత్తన్నయ్యి సాల్లే,' అని. నీటిపొరని కంట్లో అదుకుముని నడుస్తోంది ఆ ముసల్ది, తుప్పల్లోకి పదేపదే తిరిగి తిరిగి చూస్తా.

*

మరికొన్ని సంఘటనలు బావ గురించి ప్రేమగా చెప్పాక, హఠాత్తుగా అన్నాడు విజయేంద్ర. "అతను చచ్చిపోయాడు."

తన ఒళ్లో పడుకుని ఉన్న విజయేంద్ర కళ్లలోకి చూసింది కేథరీన్. అవి నిశ్చలంగా ఉన్నాయి, ఏ తడీ లేకుండా. అతను కొనసాగించాడు.

"ఒకరోజు మా ఇంట్లో ఫోను ఒకటే మోత. చెల్లెలు ఎత్తింది. అటునించి బెటాలియన్ కెప్టెన్. అతని మరణవార్త చెప్పాడు. ప్రత్యేక శవపేటికలో శవం వచ్చింది. సైనిక లాంఛనాలతో శవసంస్కారం జరిగింది. చెల్లెలి కళ్ల నుంచి ఒక్క కన్నీటిబొట్టు కూడా నేల రాలలేదు. శవపేటిక మీది పూలతో ఆడుకుంటున్న కూతుర్ని వారించను కూడా లేదు. షాక్‌లో ఉంది. కోలుకుంటుందిలే నిదానంగా అనుకున్నాం. కానీ, ఇప్పటికీ అలాగే ఉంది. అతని మరణాన్ని ఆమె అంగీకరించలేదు. భర్త కోసం రైలుస్టేషన్‌కి వెళ్దాం అంటుంది రోజూ. పసిపిల్ల కన్నా పసిపిల్ల ఇప్పుడామె."

"అతని పేరు సుబ్రమణియం కదా," అంది కేథరీన్. ఆమె గొంతులో ఎటువంటి ఆశ్చర్యమూ లేదు.

"నీకెట్లా తెలుసు?"

అతన్ని ఎక్కువసేపు ఆశ్చర్యంలో ఉంచలేదామె. "ఈ విధ్వంసంలో అందరూ పాత్రలే విజయ్. నేనూ నా పాత్ర పోషిస్తున్నా. నీకు ఇప్పటిదాకా తెలిసింది రంగస్థలం మీద కనిపించే నేను మాత్రమే. అసలు నేను వేరే. దుఃఖంతో నువ్వు నా ముందు ఇలా బద్దలయిన ఈ క్షణాన కూడా నా అసలు నేను నీ ముందుకు రాకపోతే,

నన్ను నేను మోసం చేసుకున్నట్టే. అసలు మోసమే నా ఉద్యోగం. ఈ మోసాన్ని మా దేశంలో గొప్ప దేశభక్తిగా గౌరవిస్తారు. పెద్ద జీతం. విలాసవంతమైన జీవితం. కానీ, ఇక్కడి వాస్తవాలూ, నీ స్వచ్ఛమైన స్నేహం నన్నిలా ఎంతో కాలం ఉండనిచ్చేలా లేవు విజయ్."

విజయేంద్ర కళ్లలో భయం... ఆందోళన. ఆమె అతనికి మరింత దగ్గరగా జరిగి, అతని తల వెంట్రుకల్లోకి వేళ్లను జొనిపింది ధైర్యం చెబుతున్నట్టుగా.

"విజయ్... అంతరించిపోతున్న పక్షుల మీద యూనివర్సిటీలో అధ్యయనం చేస్తున్న విదేశీ విద్యార్థిగానే నేను అందరికీ తెలుసు. నీకూ అలాగే కదా నా పరిచయం. నిజానికి, నా అధ్యయనం పక్షుల మీద కాదు, ఇక్కడి పరిస్థితుల మీద. ఇక్కడ జరుగుతున్న పోరాటాలు, మరణాలు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ పరిస్థితులు, ఇతర దేశాల నుంచి ప్రభుత్వానికీ, పోరాడుతున్న వారికీ అందుతున్న సాయాలు... వీటి మీద ఎప్పటికప్పుడు మా దేశానికి నివేదికలు పంపడం నా అసలు ఉద్యోగం. పక్షుల పరిశోధన పేరుతో ఇక్కడి అడవులన్నీ తిరిగాను. అడవుల్లో రహస్యంగా ఎందరో నాయకులనీ కలుసుకున్నాను. లోతుకెళ్లేకొద్దీ నామీద నాకే అసహ్యం పెరుగుతోంది విజయ్. నాలోని నన్ను దాచుకోవడం నావల్ల కావడంలేదు. ఈ దేశంలో బయట జరుగుతున్న విధ్వంసం కన్నా మనుషుల్లోపల జరుగుతున్న విధ్వంసమే తీవ్రమైంది విజయ్. బాంబులతో ధ్వంసమవుతున్న దేశాన్ని తిరిగి నిర్మించుకుంటాం మళ్లీ. శిథిలమవుతున్న దేశం గురించి నివేదికలు పంపగలనుగానీ, మనుషుల్లోపల కూలుతున్న వాటి గురించి ఏం రాసి పంపగలను విజయ్. ఇటూ అటూ ఎటు చూసినా నాకు కూలుతున్న మనుషులే కనిపిస్తున్నారు విజయ్..." వెక్కివెక్కి ఏడుస్తూ అతని ఒడిలో ఒదిగిపోయింది కేథరీన్.

ఎవరి దుఃఖాన్ని ఎవరు ఓదార్చాలో తెలియని వింత నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

*యాళ్‌పాణం: శ్రీలంకలో తమిళులు అత్యధికంగా నివసించే జాఫ్నా ప్రాంతం.*

**ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 ఆగస్టు 2013**

